క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం



మారేడుబాకలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

మండపేట: మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి మంచి ఆలోచనలతో ముందుకు నడవాలన్నారు. చిన్న వయసు నుంచి సమాజం దేశం పట్ల అంకితభావాన్ని అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె నెహ్రూనాయక్, కో–కన్వీనర్ సీహెచ్ దిలీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి 'చెకుముకి' సంబరాలకు 454 మంది విద్యార్థులు

కపిలేశ్వరపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న పాఠశాల స్థాయి 'చెకుముకి' సైన్స్ సంబరాల్లో 454 మంది విద్యార్థులు పాల్గొనున్నట్టు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, పెద్దింశెట్టి లెనిన్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు విజ్ఞాన ప్రతిభా ప్రదర్శనలో పాల్గొననున్నారన్నారు. కపిలేశ్వరపురం, మాచర, వాకతిప్ప, కాలేరు, అంగర, టేకి, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 285 మంది అంగరలోని రెండు ప్రైవేటు పాఠశాలల నుంచి 169 మంది మొత్తం 454 మంది పాల్గొననున్నట్టు నాయకులు తెలిపారు.

నేడు చెలికాని 39వ వర్ధంతి సభ

రామచంద్రపురం: స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ చెలికాని రామారావు 39వ వర్ధంతి సభ స్థానిక చెలికాని రామారావు భవనంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ సభలో ప్రముఖ చరిత్ర విశ్లేషకుడు కొప్పర్తి వెంకటరమూర్తి 'జాతీయత–భిన్న దృక్పథాలు' అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సహకార ఉద్యమ నాయకులు మానం ఆంజనేయులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవి సత్యనారాయణ మూర్తిలు తమ సందేశాలను తెలియజేయగా రాష్ట్ర రైతు కూలీ సంఘం అధ్యక్షుడు ఎస్.ఝాన్సీకి అభినందన సత్కారాన్ని అందించనున్నట్లు పేర్కొనారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రత్నాల రావు



రామచంద్రపురం: ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా కె.రత్నాలరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జగ్గంపేట డివిజన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వై.వి జయానంద్ అమలాపురం బదిలీపై వెళ్లారు.

కులమతాల చిచ్చు రేపుతున్న కూటమి ప్రభుత్వం

కపిలేశ్వరపురం: వంద రోజులు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కుల, మతాల కుంపటి రేపడం మినహా ప్రజా సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్న దాఖలాలు లేవని కపిలేశ్వరపురం మండల పరిషత్ వైఎస్సార్ సీపీ విప్ పలివెల మధు ఆరోపించారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావును జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులు దుర్భాషలాడడం హేయమైన చర్య అన్నారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీ కర్రను తొలగించడం కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. ఘటనకు మతం రంగు పులుముతున్న రఘురామరాజుపై కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమన్నారు. ఆయా ఘటనలను ఖండించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు పి.శ్రీనివాస్, టి.రాజేష్‌శర్మ ఉన్నా రు.

మంత్రి సుభాష్ దాతృత్వం



రోడ్డు పక్కన ఉంటున్న కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: రోడ్డు పక్కన పెద్ద సిమెంట్ పైప్‌లో గత పదేళ్లుగా నివాసం ఉంటున్న ఒక కుటుంబానికి అండగా నిలిచారు. వెల్లలో జరిగే ఒక కార్యక్రమానికి వెళుతున్న మంత్రి సుభాష్ రోడ్డు పక్కనే సిమెంట్ పైప్‌లో నివాసం ఉంటున్న వారిని చూసి తన వాహనాన్ని నిలిపారు. వారి వద్ద నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత కుటుంబానికి టిడ్కోలో గృహాన్ని కేటాయిస్తానని వారికి హామీ ఇచ్చారు. తాత్కాలిక సహాయంగా మంత్రి రూ.5 వేలను అందజేశారు.

సోలార్ రూఫ్‌టాప్..

- 'పీఎం సూర్యఘర్' పథకానికి పెరుగుతున్న ఆదరణ
- ఇప్పటి వరకు 1,408 మంది దరఖాస్తు



వెదురుపాకలో ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్

రాయవరం: వెదురుపాకకు చెందిన దంతుర్తి వెంకట సీతారామకృష్ణశాస్త్రి తన ఇంటి వద్ద 2 కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ ఆన్‌గ్రిడ్ (రూఫ్‌టాప్) వ్యవస్థను ఇటీవల ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పటి వరకూ ప్రతి నెలా రూ.1500 నుంచి రూ.2 వేల వరకూ విద్యుత్తు బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ మొత్తం సున్నాకు చేరుకుంది. తద్వారా ఏడాదిలో రూ.24 వేల వరకూ ఆదా చేసినట్టవుతోంది.

తరిగిపోని సంపద

సౌర విద్యుత్తు.. పునరుద్ధరణీయ ఇంధన వనరుగా.. అలాగే తరిగి పోని సంపదగా ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటే చక్కటి ఫలితాలు సాధ్యమవుతాయి. సోలార్ ఆన్‌గ్రిడ్ (నెట్ మీటరింగ్) వ్యవస్థ ద్వారా అవసరం మేరకు వాడుకొని మిగులును డిస్కంలకు విక్రయించే వీలుంది. ఈ నేపథ్యంలో సౌర నివాసాల్లో సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటును ఏపీఈపీడీసీఎల్ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. మరోవైపు పీఎం సూర్యఘర్ యోజన కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అలాగే సౌర విద్యుత్తును ప్రోత్సహించడంలో భాగంగా రాయితీలు కూడా అందజేస్తున్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం ప్రయోజనం పొందే వీలుంది. సహజ ఇంధన వనరులను కూడా కాపాడినట్టవుతుందని అధికారులు చెబుతున్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద రామచంద్రపురం సబ్ డివిజన్ కార్యాలయ పరిధిలో ఇప్పటి వరకూ 1,408 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ఇలా

లోడ్	ఉత్పత్తి యూనిట్లలో	ప్రస్తుత బిల్లు (రూ.)	సోలార్ ఏర్పాటు తర్వాత బిల్లు (రూ.)
ఒక కిలోవాట్	120	1000	338
రెండు కిలోవాల్	240	2,000	333
మూడు కిలోవాట్స్	360	3,000	293

పర్యావరణానికి మేలు

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తు, పెట్రోల్, డీజిల్‌పై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. అపరిమితంగా ఈ వనరులను వినియోగించడం వలన సహజ వనరులు తరిగిపోవడంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి హాని లేని సౌర విద్యుత్తు వినియోగం పెంచాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. ఇటీవల పలువురు గృహ వినియోగదారులు సౌర విద్యుత్తు వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నారు. గృహావసరాలకు నివాస భవనాలపై సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకం కింద రాయితీని పెంచింది. దీంతో మరింత మంది గృహ వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో ఒక కిలో వాట్‌కు రూ.14,588, రెండు కిలోవాట్లకు రూ.29,176 మాత్రమే రాయితీ ఉండేది. ప్రస్తుతం ఆ రెండు విభాగాలకు రాయితీని రెట్టింపు చేశారు. మూడు కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల వరకు ఒకే విధంగా యూనిట్ రాయితీని రూ.78 వేల వరకూ వర్తిస్తుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

సౌర విద్యుత్తు వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్యులకు కరెంటు చార్జీల భారం తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా నేరుగా గృహ వినియోగదారులు సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే వీలుంటుంది. సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలనుకునే వినియోగదారులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. ఆసక్తి ఉన్న వారు వినియోగదారులు పీఎం సూర్యఘర్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ఈ పథకం కింద బ్యాంకుల్లో 'ఈ–జన సమర్థన్' పోర్టల్ ద్వారా సులువుగా రుణ సదుపాయం పొందవచ్చు. 150 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తే 2 కిలోవాట్స్, 150–300 యూనిట్లు వంతున వినియోగిస్తే మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ఏర్పాటు చేసుకోవాలి. మిగులు విద్యుత్తును నెట్ మీటరింగ్ విధానంలో ఈపీడీసీఎల్‌కు విక్రయించవచ్చు. ఒక యూనిట్ ధర రూ.4.20 గా నిర్ధారించారు.

ఇప్పటి వరకు పీఎం సూర్యఘర్‌కు సబ్‌స్టేషన్ల వారీ వచ్చిన దరఖాస్తులు ఇలా

సబ్‌స్టేషన్	వచ్చిన దరఖాస్తులు
ఆలమూరు	162
ద్వారపూడి	190
మండపేటటౌన్	14
రాయవరం	55
ఏడిద	48
కపిలేశ్వరపురం	134
పామర్రు	201
రామచంద్రపురంటౌన్	382
రామచంద్రపురం రూరల్	222



విద్యుత్ మీటర్ సిస్టమ్

సద్వినియోగం చేసుకోవాలి

సోలార్ ఆన్‌గ్రిడ్ యూనిట్ల ఏర్పాటుతో విద్యుత్తు ఆదాకు మార్గం సుగమం అవుతుంది. తరగని ఇంధన వనరుల వినియోగంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి. ఇప్పుడిప్పుడే ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. సోలార్ విద్యుత్తు యూనిట్లకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి ఉన్న వారు ఏపీఈపీడీసీఎల్ సిబ్బందిని సంప్రదించాలి.

– రత్నాలరావు, ఈఈ, రామచంద్రపురం డివిజన్.

దంచికొట్టిన వాన



కె.గంగవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టింది. సుమారు మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షం కురవడం వల్ల భట్లపాలిక, కోట, కె.గంగవరం, అద్దంపల్లి తదితర గ్రామాల్లోని పల్లపు వీధులు జలమయమయ్యాయి. ఏకధాటిగా వర్షం కురవడంతో జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి. సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలో ప్రధాన కాలువలు టేకి డ్రైయిన్, రాజుకాలువ, పాణింగపల్లి పాత కాలువలు వర్షపు నీటితో పరిధి దాటి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

సామూహిక చర్యలతోనే ఎలుకల నిర్మూలన సాధ్యం



శీలలో రైతులకు ఎలుకల మందును తయారీ చేస్తున్న వ్యవసాయాధికారులు

కాజులూరు: సామూహిక చర్యలతోనే రైతులు ఎలుకలను నిర్మూలించగలుగుతారని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు ఎలుకల మందు పంపిణీ చేశారు. ఏఓ అశోక్ మాట్లాడుతూ మనిషి తర్వాత జీవరాసులన్నింటిలో ఎలుక తెలివైనదన్నారు. ఒక రైతు మందుపెడితే అది తిన్న ఎలుక చనిపోయేముందు పక్కపొలానికి వెళ్లి ప్రమాద పరిస్థితిని ఇతర ఎలుకలకు చేరవేస్తుందన్నారు. రైతులందరూ ఎలుకల మందును తీసుకుని నియమిత మోతాదులో ఎరను తయారు చేసుకోవాలన్నారు. తర్వాత ఒక ప్రాంతంలో రైతులందరూ ఒకేమారు సామూహికంగా ఎలుకల సంహరణ చేపట్టాలన్నారు. మందు ఎరను తయారు చేసే విధానాన్ని సిబ్బంది రైతులకు వివరించారు.

మండపేటలో 65 మందికి వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: జమాతె ఇస్లామీ హింద్ మండపేట శాఖ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జయంతి మాసం సందర్భంగా స్థానిక గాంధీనగర్ చిన్న మసీదు ఆవరణలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజానగరానికి చెందిన జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్య బృందం హాజరైన సుమారు 650 మంది రోగులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పట్టణ ప్రజలకు చేరువగా ఉంటున్నారన్నారు. మహ్మద్ ప్రవక్త జయంతి నెల సందర్భంగా ఈ 30 రోజులూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని శిబిరం నిర్వాహకుడు అబుల్ అలా తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం, క్లబ్ చైర్మన్ నల్లమిల్లి వెంకట కృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, కోశాధికారి చుండ్రు కృష్ణమోహనరావు, జమాతె ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి షరీఫ్, జిల్లా అధ్యక్షుడు అమీర్, సభ్యులు పాల్గొన్నారు.

పూలే దంపతుల ఆదర్శాలతో ముందుకు వెళదాం



ద్రాక్షారామలో పూలే దంపతులకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: ఆదర్శ దంపతులు, సంఘ సంస్కర్తలు అయిన మహాత్మా జ్యోతీరావ్ పూలే, సావిత్రీ బాయి దంపతుల ఆదర్శాలతో సమాజం ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పిలుపు ఇచ్చారు. మండలంలోని ద్రాక్షారామలో పూలే దంపతుల విగ్రహాల దగ్గర సత్య శోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే దంపతుల విగ్రహాలకు బి.సిద్ధూ, అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ద్రాక్షారామ జై భీమ్ నాయకులు వి.రామకృష్ణ, ఐఎస్టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు కరిపోతుల నవీన్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిద్ధూ, భీమశంకరం మాట్లాడుతూ కుల నిర్మూలన, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పూలే దంపతులు సత్య శోధక్ సమాజ్‌ను స్థాపించారన్నారు. వారి ఆశయాలు కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సాగర్, చందు, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో వ్యక్తిత్వ వికాసం సాధ్యం



మానవత సంస్కార విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: ప్రతి విద్యార్థికీ వ్యాయామం అవసరమని, ముఖ్యంగా యోగాభ్యాసం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పేర్కొన్నారు. మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రకృతితో మమేకం కావాలన్నారు. విద్యతో పాటుగా యోగా సాధన, పెరటి తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయం, మొక్కల పెంపకం, సమాజసేవ వంటి అలవాట్లు విద్యార్థి జీవితంలో భాగం కావాలన్నారు. ధ్యానం చేయడం ద్వారా కలిగే లాభాలను అనుభవ పూర్వకంగా విద్యార్థులకు వివరించారు. గంట పాటు నిర్వహించిన సెమినార్‌లో విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- అంతరిక్ష పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- మాజీ శాస్త్రవేత్త శివప్రసాద్



మాచర హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న శివప్రసాద్

కపిలేశ్వరపురం: అంతరిక్ష పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాకెట్ ప్రయోగాలు తీరుతెన్నులను శివప్రసాద్ వివరించారు. విద్యార్థుల్లో జిజ్ఞాస ఉంటే రహస్యమనుకున్న ప్రతి అంశాన్నీ మనిషి ఛేదించవచ్చన్నారు. సామాన్య కుటుంబం నుంచి అంతరిక్ష ప్రయోగాల్లో భారతదేశాన్ని ప్రముఖంగా నిలబెట్టిన ఏపీజే అబ్దుల్ కలాం నేటి విద్యార్థులకు ఆదర్శమన్నారు. వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా అనేక మంది శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. శివప్రసాద్ దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది ఓప్రకాష్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కోటి మొక్కల పెంపకానికి 'వాసవీ' శ్రీకారం



విద్యార్థినుల సహకారంతో సీడ్ బాల్స్ తయారు చేస్తున్న వాసవీ వనితా క్లబ్ సభ్యులు

మండపేట: పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఒకే రోజు కోటి విత్తనాలు నాటి మొక్కలు పెంచడానికి శ్రీకారం చుట్టామని వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు కాళ్లకూరి శాంతి తెలిపారు. మండపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినుల సహాయంతో మంగళవారం ఆ క్లబ్ సభ్యులు సీడ్ బాల్స్ తయారీ చేపట్టారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ నేరేడు, బాదం, మద్ది, కుంకుడు, విత్తనాలతో 10 వేల సీడ్ బాల్స్ ఇప్పటికే తయారు చేశామన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు దేశవ్యాప్తంగా రహదారులకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలు, అటవీ మైదాన ప్రాంతాల్లో విత్తనాలు చల్లుతామన్నారు. కార్యక్రమంలో తోటవారి జాబిల్లి, బోడా వీర్రాజు, నాళం వాణి, బోడా జయరేఖ, పట్నాల జయశ్రీ , సంకా సీత, బోనగిరి ఉమ, బోనగిరి రమణి, పెరుమాళ్ల మహాలక్ష్మి, మిర్తిపాటి మహాలక్ష్మి, మండవల్లి దేవి, కాళ్లకూరి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్



రవి

మండపేట: డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలోను, వాటికి పబ్లిసిటీ చేసి ప్రజలను నమ్మించడంలోనూ సీఎం చంద్రబాబు నాయుడు దిట్ట అని వైఎస్సార్ సీపీ 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్ అన్నారు. తన కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. పథకాలు అమలు చేయలేక తిరుపతి లడ్డూ అంశాన్ని తెర మీదకు తెచ్చి ప్రజల మనసుల్ని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. మంచి ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులు 100 రోజుల పాలనలో ప్రజలకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పేరుతో మేనిఫెస్టో ప్రవేశ పెట్టి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే అవన్నీ అమలు చేస్తామని చెప్పిన గొప్పలు ఏమయ్యాని దుయ్యబట్టారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

కాజులూరు: నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా గొల్లపాలెం పిల్లారిశెట్టి భూషి కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ 100 రోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అంగర కృష్ణ, దేగల సతీష్, సానపాల ధనరాజు, చందాల బాబి, అంగర శ్రీను, పేపకాయల బాబ్జి పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలకే 'పొలం పిలుస్తోంది'



రాయవరంలో పొలం పరిశీలన



దంగేరులో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ సిబ్బంది



టేకిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రాయవరం: సాగులో రైతుల ప్రయోజనాలు రక్షించేందుకు, వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ద్వారా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. రాయవరం, వి.సావరం గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత రైతులతో కలసి ఏవో పంట పొలాలను పరిశీలించారు. పంటలపై తెగుళ్ల, పురుగుల ఉధృతిని పరిశీలించి రైతులకు నివారణ సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి వారం మంగళ, బుధవారాల్లో వ్యవసాయం, అనుబంధ శాఖల ద్వారా ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాలను రైతులకు వివరిస్తామన్నారు. సాగును లాభసాటి చేయడంతో పాటుగా, రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి పంటకు వచ్చే తెగుళ్ల, యాజమాన్య పద్ధతులను ఏవో రైతులకు వివరించారు. పశు సంవర్ధక శాఖ వైద్యురాలు శ్రావణి మాట్లాడుతూ రైతులకు పాడి లాభసాటిగా ఉంటుందన్నారు. పాల ఉత్పత్తి ఏ విధంగా అభివృద్ధి చేయాలి? పాలలో వెన్న శాతం పెంచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎటువంటి పశు దాణాను పశువులకు వినియోగించాలి? తదితర అంశాలను వివరించారు. ప్రతి రైతూ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, స్థానిక నేత దేవిశెట్టి చిన్ని, మార్కెటింగ్ శాఖకు చెందిన సతీష్, వ్యవసాయ శాఖ సహాయకులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

కె.గంగవరం: ప్రస్తుతం ఖరీదు అవుతున్న వ్యవసాయం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులు సాగు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి.నందకిషోర్ అన్నారు. మండలంలోని దంగేరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆకు ఎండు తెగులు ఉధృతి అధికంగా ఉందని దీని నివారణకు నత్రజని వాడకం నిలిపివేయాలని సూచించారు. మురుగునీరు తొలగించిన తరువాత ప్లాంటమైసిన్ బాక్టీరియామైసిన్ 100 గ్రాములతో పాటు మరో మందును కలిపి పిచికారీ చేస్తే తెగులు నివారణ అవుతుందన్నారు. రామచంద్రపురం ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ వరి సాగులో తెగుళ్ల, పురుగులు తట్టుకునే శక్తి రావాలంటే ఆఖరు డోస్‌గా ఎకరానికి 20 కేజీల పొటాష్ ఎరువు, 5 కేజీల యూరియాతో కలిపి వేయాలని సూచించారు. అనంతరం స్థానిక పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఓ బలుసు రవి, వ్యవసాయ సంచాలకుడు రంగారావు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెల్లలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, మండల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం వారంలో ప్రతి మంగళవారం, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, మంచెం దేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాలపై మండలంలోని టేకి, వాకతిప్ప గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏవో కేవీఎస్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ వరి పంటను ఆశించే తెగుళ్ల, వాటి నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటపై బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, సుడిదోమ, జీవిత చక్రం తదితర అంశాలపై చార్టులను ప్రదర్శిస్తూ వివరించారు. పశువైద్యులు డాక్టర్ కేబీఎస్ఆర్ ప్రసన్న, జూనియర్ వెటర్నరీ అధికారి మూర్తి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తి పాడి పశువులుపై చూపే ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో ద్వారపూడి ఏఎంసీ ప్రతినిధి గోవిందు, వ్యవసాయ సహాయకులు జి.హరిబాబు, టి.నాగభూషణం, సహకార సంఘం సీఈఓ నవీన్ కుమార్‌ం ఉప సర్పంచ్ పుట్టా రామకృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.